# 'పరిణామం'

రచన :
'వీరాజీ'

ప్లాటుఫారం వదిలి రైలు చీకట్లోకి జారిపోయింది. కమల భారంగా అడుగు లేస్తో గేటు దాటి యివతలకి వచ్చేసింది. శంకరం అక్కడ నిలబడి యెదురుజూస్తున్నాడల్లేవుంది; 'పద, బండి మాట్లాడేను' — అని అంతే యీ పొడిమాటలన్నాడు. ఆ సమయంలో యెటువంటి భావమూ లేదతనిలో. ముడివేసిన భ్రుకుటిని విప్పి ఒక్కసారి బుసకొట్టింది కమల శంకరాన్ని చూసి. బండి శంకర రోడ్డుమీద కదిలింది చీకట్ని చీలుస్తూ. 'నీకు స్టేషన్లో పనుంటే తగినయేర్పాట్లు చేసివుందును కమలా! మాట మాత్రంగానైనా అనాల్సింది'— బాధగా మూలిగినట్లుందతని వాగ్ధోరణి. ఎంతో 'యిదై' వుంటాడు కాబోలు. చీకట్లో కమలకి అతని ముఖ కవళికలు గమనించే అవకాశం లేకపోయింది. ఉన్నా ఆమె లక్ష్యపెట్టేట్లు లేదావేళ. 'ఉహ్' ఆమె నిట్టూర్చింది. 'చేసేందుకేముంది స్టేషనుకి షైరు రాలేదునేను' శంకరం అన్నాడు "ఔను యీవూళ్ళో పార్కులు లేవులే. ఐనా...." ఆగిపోయేడు. ఎంత అహంకారం. ఏమి ఎక్కసక్కెలు కమల కస్సుమంది. 'ఎందుకొచ్చిన చదువూ సంస్కారం యివతలవాళ్ళ మనసుల్ని గుర్తించకపోయేక' బండి మలుపు తిరిగింది కాబోలు రోడ్డులాంతరు కాంతి ఒక్కక్షణంసేపు ఆమె ముఖంలోకి తొంగిచూసింది. స్పష్టంగా జూసేడు శంకరం ఆమె కళ్ళల్లో నీళ్ళునిండేయి.

"అదేమిటి పిచ్చిపిల్లా! కారణంలేకుండా.." ఆమెను దరి జేర్చుకు ఓదార్చవలెననుకున్నాడు కాని అలా చేయలేదు. 'ఎవరికీ ఏం సానుభూతి అక్కర్లేదు.' గద్గదికంగానే అంది కమల. చివరకి గుమ్మం దగ్గర దిగగానే కొంచెం అధికారస్వరంలో, భర్తలాగ అన్నాడు శంకరం. 'ఇంతకీ అసలు కారణం జెప్పేవుకాదు?"—

'సరోజినికి సెండాఫ్ యివ్వడానికి' దభాల్న తలుపు తోసి లోపలికి దూసుకుపోయింది కమల. 'అరె నాకు జెప్పనేలేదే..' ఏమైనా అనాలని ఆగిపోయేడు, లైటుస్విచ్చివేస్తూ.

అప్పటికే కమల అక్కడలేదు ఆఫీసుబడలిక ఆకలి, ఆయాసం, అలసటా, కోపం, అహంకారం, మగతనం అన్నీ ఒక్కసారి పెనవేయగా 'కమలా' అని అరిచేడు. ఆ శబ్దంపెరట్లో నూతివరకూ వెళ్ళి నిరుత్తరమై తిరుగివచ్చేసింది.

శంకరానికి యేవిషయమూ గొడ్డళ్ళవరకూ రేవడం యిష్టంలేదు. అదీగాక కమల నొచ్చుకుందంటేనే అతనికి సిగ్గుకూడా వేస్తుంది. ఎంత 'యిదై'నా చల్లారిపోయే వాడేగాని 'కమల'ని పల్లెత్తుమాటయినా అనలేకపోయేవాడు. తన జీవితం యెడారి గాపోతున్నదనుకున్నప్పుడు కూడా, కళ్ళుమూసుకు, హృదయం ఉగ్గబట్టుకొనేవాడు.

'దాని సంగతి నీకు తెలియందిగాదు. మనమంతా ఓ బళ్ళో పాఠాలు చదువుకున్నా మనస్సుల్ని గుర్తించి మమకారాలు పెంచుకొనే శక్తి అందరికీ అబ్బిందిగాదు.. దానికడుపునోకాయగాస్తే అదీ నిన్ను గ్రహిస్తుంది. ఇంతకీ శంకరం, దాన్ని ఆరాధ్యదైవంగా ప్రేమించే నీకు యీ సరూ..జెప్పేపాటిదా'- సరోజిని మొన్న తన యింటికి వచ్చినప్పుడన్న మాటలివి. ఔను అభిమానం మరిచిపోయేవాడా లేకపోతే తను. అలాగే 'ఆఫీసు బట్టల'తోటే అనునయించడానికా అన్నట్లు ఆఫీసురూం దాటేడు.

అక్కడిదృశ్యం అతణ్ణి పడకగదివరకు పోనివ్వలేదు. 'నౌకరువెధవ..' యేడుపు మొహంతోటే పళ్ళు పటపటా కొరికేడు. అంతకంటే పెద్దతిట్లతనికిరావుమరి. 'కారియరుభోజనం తెచ్చిపడేసేడల్లేవుంది; పిల్లిముండ తిరుగద్రోసింది; పోనీలే యీపూట యెలాగా తినాలని లేదు. అలిగిపస్తున్నాడనేమాటరాదు' అనుకున్నాడు. 'నీవు చదువుకున్న బుద్ధిమంతుడివి బాధ్యతలు, ఆదర్శాలూ అంటూ ఉపన్యాసాలు వెలగబెడతావు. భార్యపస్తుంటే చూస్తూ ఊరుకుంటావా?' అనిపించింది తనలోనే. అలాగే కోటుతగిలించుకు వీధిలోపడ్డాడు. ఆ రాత్రివేళ పిచ్చివాడికిమల్లే.

కమల పక్కమీద పడుక్కుని వెక్కివెక్కి యేడ్వలేదు. బుసలుకొడ్తూ మంచంమీద బోర్లాపడుక్కొని 'ఎంత అహంకారం! తనకంటే అతనుద్ధరించిందేమిటి? తను వెలగబెట్టిన ఆనర్సేగా..ఛీ! మగాడికి లొంగి

వుండడం అంతనీచం యింకోహటిలేదు. .' ఆమె తల గడసులిపేసి దిండులో ఋఱ్ఱుపెట్టుకుంది. బలంలేని దానికి మల్లే అలానేవుండిపోయింది. ఆమెకి వెనుకటి రోజులన్నీ స్మృతిపథంలో సుళ్ళుతిరిగేయి. రాయ్‌బహదర్ రఘునాధంగారమ్మాయి. ఆనర్సు చదువుకున్న విద్యావతి ఒక మామూలు కాలేజీ లెక్చరరు. .ఆస్తిపాస్తుల్లేని. . నవీనయుగంలో నాగరికంగా బ్రతకలేని. .శంకరంభార్యగా ఊడిగంచేయడమా. .

ఆమె నడుస్తూంటే యెంతమంది కుబ్రకుంకలు — కుఱ్ఱకుంకలేమిటి — మోహన్, శేఖర్, చందన్ అందరూను వెనకాలే తన యింటివరకూ సాగనంపేవారు పాపం. వాళ్ళెన్ని రకాలుగా మెచ్చుకొనేవాళ్ళు తనని. ఎన్నెన్ని 'ఎడ్మైంచర్లు' చేసేవాళ్ళు. కేవలం తాను జాలి పడేందుకు! వాళ్ళ ఉత్తరాలు చూస్తే ఒక మహారాణికి సేవకులు రాసేవిగా, అప్సరకి మానవు లంపేవిగావుందేవి. అలాంటిది తన ఖర్మంగాకబోతే కవి, కావ్యాలల్లుతాడు, రసికుడు, బుద్ధిమంతుడు, సంప్రదాయం వున్న వాడు అని యేవో అనుకొని యీ. .నరకకూపంలో పడ్డ వేమిటి. 'ఛీ! నాన్న దగ్గఱికిపోతాను' అనుకుంది. గభీల్న లేచికూర్చుంది. గడియారం పదకొండున్నర కొట్టింది. ఆగంట తనను 'ఆగు శంకరాన్ని నీవు ప్రేమించలేమా. .నీఅంగీకారం లేకుండానే. .నీవు మారాం చేయకుండానే ఒక భాగ్యవంతుని ముద్దుబిడ్డ సామాన్యుని చేతుల్లో యెలా వచ్చిపడిం దంటావ్!. .' అని నిలదీసినట్లుంది.

'ఐతే స్వయంకృతాపరాధమా యిది' కళ్ళు రెండూ చేతుల్తోకప్పుకు వాలిపోయింది కమల. పాపం కమల ఆడపిల్ల. ముద్దూమురిపెమేగాని జీవితంలోని ఒడుదుడుకులేమిటో యెఱుగనిది. బాధంటే తెలీంది. ఒక్కసారి సామాన్యజీవితం యెలా భరిస్తుంది. - చదువుకున్న నాటి నుంచీ విలాసంగా గడిపేసింది. ఎన్నో మధురస్వప్నాలు కన్నది. సీమలుదాటి తిరగాలని, జీవితంలో భోగభాగ్యాలు కొల్లగట్టుకోడం తన కర్తవ్యమనీ అనుకున్నది. తను ధనవంతులబిడ్డ అనీ, విద్యావతి అనీ అహంకారం తనకీ రెండేళ్ళలోనూ యెక్కువైందేగాని, నిజమైన ఆనందం వెతుక్కోనిచ్చిందికాదు.

అంతలోనె ఆమె విద్యాగర్వం, అహంకారం విజృంభించేయి. తను చదువుకున్నది ఇలాటి దీనావస్థలో యేడవడమేమిటి? ఉన్నపాటున నాన్నదగ్గఱికి వెళ్ళిపోదామనుకున్నది. తుఫానులేచిన సంద్రపు కెఱటంలా ఉవ్వెత్తుగాలేచింది. అర్ధరాత్రి ట్రయినుకే సన్నాహమయింది.

గుమ్మందాటి లోపలికి అడుగుపెట్టి శంకరం గుమ్మంలోనే నిర్విణ్ణుడై "ఏమిటి కమలం! చాదస్తం!" అన్నాడు. "చాదస్తంకాదు చట్టుబండలూకాదు చేసుకున్నందుకు ఫలితం. కొనుక్కున్న నరకం. నన్ను అడ్డుకోవలసిన అవసరంగాని, అనునయించాల్సిన దైన్యంగాని ఎవరూ కలిగించుకో నక్కర్లేదు." శంకరం అభిమానం పూర్తిగా దెబ్బతిన్నది. 'భగ్గు' మన్నాడు.

"కమలా! నువ్వు కేవలం చదువు కొన్నావు. సంస్కృతి సంస్కారాలంత తేలిగ్గా పట్టుబడవు. ఈ అర్ధరాత్రి ప్రయాణం మనిద్దరికీ మంచిదికాదు. అంతగా వెళ్ళాల్నుంటే రేపు వెళ్లు. నామాట కేవలం గ్రహించు" తను తెచ్చిన మిఠాయి పొట్లం అక్కడే పెట్టి వెళ్ళిపోయేడు శంకరం విసురుగా. వెళ్ళిపోయే ముందు అన్నాడు: "కమలం! తెగేవరకూ లాగే మనస్తత్వం నాదికాదు. మనసులు విరిగితే అతకవన్నది నీకు తెలవందీ ఊహకందనిదీగాదు. జీవితంలో యింత పొరపాటు చేస్తానని అనుకోలేదు. చేసేసేను. క్షమించు"

"హుఁ యీ వెధవ తిండికి మొహంవాచి పోలే" దన్నది ఆమె అహంకారం. ఎంతనిర్లక్ష్యం! ఏమైనా ఆ అర్ధరాత్రి ప్రయాణం ఆగిపోయింది. "ఛీ! పనికిమాలిన దాన్ని. అతను నన్ను శాసించడంగాదు యిది" అనుకుంది కాని ఆగిపోయింది.

## 2

అకస్మాత్తుగా దిగిన కమలనుజూసి రాయ్‌బహదూర్ చకితుడయ్యేడు. ఇంటిల్లిపాదీ భయపడ్డారు. "అక్కడ నాకేం తోచలేదు. ఆవూరి నీళ్ళేం బాగాలేవు" కమల సంజాయిషీపలికింది. "కళ్ళు నెత్తికెక్కిన వ్యవహారంగాక పోతే వచ్చి దిగబెట్టిపోరాదూ" మామగారు డబ్బుతో మాట్లాడేడు.

"రైలు కొత్తదా, ఊరు కొత్తదా!" పొడిగా అన్నది కమల. "ఇదేమిటి, శంకరాన్ని సమర్థించడంకాదాయిది" అనుకుంది తనలో.

కమల షైరు వెళ్దామని కారు తీయమంది. మెస్తాబై మెట్లుదిగుతూంటే "అమ్మగారూ! ఉత్తరముంది."— ఉత్తరం చేతికందింది. 'శంకరంరాసే'దనుకుంది. "కాదు లే" అనుకుంది దస్తూరీచూసి. చింపింది. సరోజినీరాసినది.

సరోజిని ఉత్తరమే, కమల మనసులో యింకా తుఫాను రేపుతున్నది. తన తొందరపాటునది ఉటంకిస్తున్నది అది ఆమె బుఱ్ఱలోంచి తీసి పారేద్దామనుకున్నా సరోజిని తానై చెవిలో గగ్గోలు పెడుతున్నట్టుంది "నువ్వెంత అదృష్టం జేసుకున్నావు. శంకరంలాంటి భర్తనిచ్చేడు దైవం నీకు. మీ వూరికి ఉత్తరం రాస్తేను. సమాధానం లేదు. గ్రహించేను విషయం. అహంకారంలో ఆనందం గోల్పోతున్నావు" 'హం' అనుకుంద. 'ఆనందంట!' అదృష్టంజేసి తానే కట్టుకోకపోయిందీ, శంకరాన్ని. వెంటనే 'చురుక్'మని కంచీదెబ్బ తిన్నట్లు ఫీలయింది. శంకరం తన భర్త అన్న విషయం స్ఫురణకొచ్చింది. ఎందుకో తనలో వున్న హిందూ సంస్కృతి ఒక్కుమ్మడి పొడసూపింది. కాని... శంకరం తనక్రింది అంతస్తువాడన్న విషయం తీసిపారేయలేకపోయింది.

రెండు మూడు సంవత్సరాల క్రితం శంకరంతో యీ బీచి ఒడ్డునే కూర్చున్నప్పుడు వేరేస్వర్గం లేదనిపించింది. శంకరంలో లోపమన్నదే కనిపించలేదు. దైవంగా భావించుకున్న రోజులవి. వివాహ బంధం యింత మనస్పర్ధలకి తావుగా లేదుకదా? ఇప్పుడదే శంకరం. అంతకంటే మరోమెట్టు పైకెగబ్రాకి తన భర్తయైనపుడు— తల్చుకుంటే చీమలూ, జెఱ్ఱులూ పాకినట్లు ఫీలవుతున్నదితను. బహుశా యిందుకు కారణం శంకరం ఆర్థిక పరిస్థితులా? తనను తాహతుకు తగినట్లు పట్టుపరుపులమీద నడపలేకపోడమేనా.—నిత్యం షైర్లకు, టూర్లకు తీసుకు తిరగ లేదనేనా— ఇంతమాత్రమేనా—లేదు. తనకి శంకరం తగిన న్యాయం చేయలేదు... ఛీఛీ తను సరోజినన్నట్లు అహంకారంలో...... ఒకనాడు శంకరమే అన్నాడు. "నరకమైనా స్వర్గమైనా మనం ఊహించుకోడంలోనే వుంది. మనం సృష్టించుకున్న నరకమే మన్ని రాసి రంపాన పెడుతుంది. లేదు కమలం! ఒడుదుడుకుల్ని తట్టుకునేందుకు విశాల హృదయం కావాలి"—

ఐతే యిప్పుడు తను పారిపోయి వచ్చింది. తను సృష్టించుకున్న నరకంనుంచా. లేక శంకరం చేసిన నరకంనుంచా! ఇంతకీ తను శంకరంనుంచి దూరం యెందుకయ్యింది. "అయ్యో శంకరం యేమయిపోయేడో"— హృదయం దేవుతున్నట్లయి దిగాలుపడిపోయింది. ఒక్క పరుగునవెళ్ళి వాలిపోతే శంకరం చేతుల్లో. "పిచ్చిపిల్లా! అమాయకురాలివి. అల్లారు ముద్దుగా పెంగడం తప్ప నీకు మరేం తెలీదం"టాడు. తప్పకుండా జేరదీసుకుంటాడు. ఆమె అలా ఆలోచిస్తూనే లేద్దామనుకుంది ఉద్వేగంలో. కాని మరుక్షణంలోనే ఆమెలోని దురభిమానం విజృంభించింది. ఛీఛీ! అతను నాకు జాలి. సానుభూతి యివ్వనఖర్లా. అతని అనురాగానికి నేను మొహంవాచి పోలేదు"— ఆమెలోని సంఘర్షణలు ఆమెని హతాశురాలుగా జేసేయి. ఏమైనా శంకరంరావాలి. ఈవూళ్ళోనే యేదో తన తండ్రి వేయించిన ఉద్యోగం చెయ్యాలి. తన కనుసన్నల్లో మెలగాలి. అంతవరకూ తాను దిగివచ్చేదిలేదు అనుకున్నది కమలకారుస్టార్టుజేస్తూ.

ఒకవేపు శంకరముా ప్రేమా— మరోవైపు తను సృష్టించుకున్న నాగరికత, తన అంతస్తూను— ఆమెకు కంట కునుకులేదు.

## 3

శంకరం తాళంవేసినయిల్లుజేరి ఆశ్చర్యపోలేదు. కాని వెళ్ళిపోదనే ఆశపడుతూ వచ్చినవాడల్లా అది నిరాశకాగా పేలవంగా ఒకసారినవ్వి కుర్చీలో కూలబడి పోయేడు. అతను కమలను మనసారా ప్రేమిస్తున్నది నిజం. ఆమె కోసం అతనెన్ని బాధలైనా సహించగలడు. సహించేడు కూడా. కాని అభిమానం చంపుకు మామగారింట భార్య చేతి కీలుబొమ్మయి లోకం దృష్టిలో కంటక పడలేడు. ఇలా తను కట్టుకున్న ఆశాసౌధాలు కూలినా, యెడారి బ్రతుకు గడుపుతాడేగాని, దుర్భరమైన భావదాస్యం పాలుగాలేడు.

శంకరం కమలని తిట్టలేదు. చదువుకున్న ఆమె తన ర్థం జేసుకోలేక పోయినందుకు యెవర్ని నిందించాలో తెలీక హతాశుడై కూలబడుతాడు.

మూడు పువ్వులూ ఆరుకాయలుగా, చీకు చింతాలేక సంసారం గడపాల్సిన జీవితంలో తొలివలపులోనే తన బాట గండిపడింది. తనకీ ఆదర్శాలకీ పెద్ద అగాధమేర్పడిపోయింది.

ఉత్తరం రాద్దామనుకుంటాడు. రాయలేక పోతాడు. ఏమని రాయాలి. చివరికి పట్టువిడుపూ అయేక యెన్నో సంఘర్షణలకు తట్టుకుని, యీ వుత్తరంరాసి పోస్టు జేసేడు.

"అనుకోలేదు యెండమావుల్ని తాగుతూ బతకాల్సి వస్తుందని. ఐనా నేను పెద్ద పొరపాటే చేసేను ప్రాయశ్చిత్తం చేసుకుంటానులే. నువ్వెక్కడున్నా సుఖపడుతున్నాను అనిరాయి. అంతకంటే మహదానందం యింకోటి లేదునాకు క్షమించు యీమాట నా హృదయంలోంచి సదానిన్ను ప్రేమించే నీ—"

ఈ పుత్తరం అందుకున్న కమల వెక్కి-వెక్కి యేడ్చింది. శంకరం వస్తే తాను వెళ్ళిపోదామనుకుంది. రమ్మనకుండా అతనెలావస్తాడు.

అభిమానం కొద్దీ ఉత్తరానికి సమాధానం యివ్వలేదు. మంచం పట్టింది. ఉత్తరం రాయాలనుకోలేదు. మనోవ్యధతో చిక్కి శల్యమై, అహంకారం, అభిమానం, వీటి నడ్డుపెట్టుకు శంకరాన్ని దూరం చేసుకున్నది.

చివరికి మంచాన వుండే "సుఖంగా వున్నాను. కసి తీరిందిగదా. ప్రాయశ్చిత్తం ఆలోచించు" అని పొడి వుత్తరం ఒకటి శంకరంపేర పోస్టుజేసింది.

## 4

నాలుగు నెల్ల తరువాత రాయబహద్దూర్ కూతురు బతుకుతుందనే ఆశలేకనో యేమో, అమెని బతిమాలేడు. "నేను వెళదామనుకుంటున్నానమ్మా మీ ఆయన దగ్గఱకు" అన్నాడు కోపం దిగమింగుతూ.

"లేదు నాన్నా! శంకరం నా దగ్గరకిరావాలి" అన్నది నీరసంగా "అయ్యో ఉత్తరమైనారాయమ్మా ఈ వయస్సులో నన్ను—" కళ్ళనీళ్ళు గ్రుక్కు కొన్నాడు ముసలాయన.

"లేదు సుఖంగా వున్నానని — ప్రాయశ్చిత్తం ఆలోచించమని రాసిపడేసేను. అంతేకావాలి అహంకారం వున్నవాళ్ళకు" అన్నది కన్నీళ్ళింకి పోయిన కళ్ళతో. మంచాని కంటుకు బల్లిలా అయిపోయినా కమల యింకా పూర్వపు హుందా అహంకారం తగ్గిందానిలా లేదు.

ముసలాయన డాక్టరుతో వెలుపలికి నడిచేడు. ఓదార్చడం తెలీక.

ఆరోజే అల్లుడున్న వూరికి పయనమయ్యేడు. కారు యెక్కుతున్నవాడల్లా దూరాన సరోజిని రాక చూసి నిలబడిపోయేడు.

......"యిలా అయిందమ్మా, నీ కమలం... నా ఒక్కగా నొక్క బిడ్డ ...ప్రేమా పెళ్ళీ... అన్నీ కొంపముంచేయి" అంటూ వలవలా యేడ్చేడు పసిపిల్లవాడిలా.

సరోజిని కూడా కళ్ళనీళ్ళ నాపుకుంటూ "బాబాయ్! అంతా దైవానిదే దోషంకాదు. మనం కూడా బాధ్యులమే. మీరు యింక అల్లుణ్ణి చూడ్డానికి అవూరు వెళ్ళనక్కరలేదు. ఈవూరిమెంటల్ హాస్పిటల్‌లోచూడొచ్చు" ముసలాడి ఒళ్ళో తలదూర్చి బావురుమంది. తేరుకుని "బాబాయ్! కమలంని నే చూసుకుంటానులే" సానుభూతిగ అన్నది.

## 5

"ఫర్వాలేదే పిచ్చిదానా! నేనున్నాగా. మెంటల్ డిజార్డర్! అంతే. "ఎగ్సహాస్ట్" అయ్యాడు శంకరం. మరేం బెంగపెట్టుకోకు" అని ఓదార్చబోయింది సరోజిని కమలని.

కొంచెంసేపు వెక్కి-వెక్కి యేడ్చి "అయన నాకు దక్కరంటావా" అంది కమల. సరోజిని కళ్ళనీళ్ళు కనబడకుండా "పిచ్చిదానివైతే యెలాగ? నీవు నాకు చెప్పాలి... ఆయన్ను నువ్వు క్షమాపణకోరుతే మనవాడవుతాడు. ఆయనెప్పుడూ నీవాడే..."

శంకరానికి సేవలు జేస్తూనే అహర్నిశలు గడుపుతున్నది కమలం. కాని ఇదివరకటి కమలం కాదీ కమలం. ఇదివరక శంకరం ఔతాడేమోనని ఆశతో దేవుళ్ళనూ, డాక్టర్లనూ వేడుకొంటున్నదీ 'కమలం.'